క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కండి



లేపాక్షి నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి

చిలమత్తూరు/ లేపాక్షి : స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ నేత వేణురెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన లేపాక్షి మండల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో విజయదుంధిబి మోగించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, నాయకులు, హెచ్‌ఎన్ మూర్తి, శీన, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లన్న, అన్సర్, కొల్లప్ప, రవి, వెంకటేష్, తిప్పన్న పాల్గొన్నారు.

మల్బరీ సాగు విస్తీర్ణం పెంపునకు ప్రాధాన్యత

మడకశిర రూరల్: మడకశిర నియోజకవర్గంలో మల్బరీ సాగు విస్తీర్ణం పెంపునకు ప్రాధానత్య ఇస్తున్నట్లు పట్టు పరిశ్రమ శాఖ ఏడీఏ కె రాజు నాయక్ తెలిపారు. శనివారం తడకలపల్లి వద్ద విదేశీ పట్టు గ్రుడ్ల ఉత్పత్తి కేంద్రం పరిధిలోని పొలంలో వీ-వన్ మల్బరీ నర్సరీ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లక్ష వీ-వన్ నర్సరీ మొక్కల పెంపకాన్ని ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుతం 50 వేల వీ-వన్ మల్బరీ మొక్కలు నర్సరీలో పెంపకం చేపట్టామన్నారు. మల్బరీ తోట పెంపకం చేపట్టే రైతుకు ఒక మొక్క రూ.2 చొప్పున పంపిణీ చేస్తామన్నారు.

ఎస్సీ సెల్ సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: ఈనెల 8న మడకశిరలో తలపెట్టిన ఎస్సీసెల్ సభను విజయవంతం చేయాలని ఎస్సీసెల్ నాయకులు కోరారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను సానిపల్లి ఆశ్రమం వద్ద ఆవిష్కరించారు. ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు నేతృత్వంలో ఉదయం 10 గంటలకు షాదీమహల్‌లో సమావేశం ఉంటుందని, ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు గంగాధర్, చిన్నా, విజయకుమార్, శంకర్, సోమందేపల్లి మండల కన్వీనర్ గజేంద్ర, తిమ్మయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షి: మానేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రశేఖర్(26) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్‌అహమ్మద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజి, రఘునాథరెడ్డి, శంకరప్ప, నాగరాజు, ప్రభాకర్‌గౌడ్, క్రిష్టప్ప, తిప్పన్న, ఆన్సర్, చంద్రమోహన్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మారువేషంలో ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మారువేషంలో వెళ్లి తనిఖీలు చేశారు. ఆయన తలకు టోపీ పెట్టుకుని,ముఖానికి మాస్క్ ధరించి ఎవరూ గుర్తు పట్టకుండా ఆస్పత్రిలోకి వెళ్లి వివిధ వార్డులను పరిశీలించారు. డాక్టర్లు సమయానికి వస్తున్నారా? లేదా ?అని రోగులను అడిగి తెలుసుకున్నారు. నైట్ డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉంటారా లేదా అని ఆరా తీశారు. రోగులు ఈసందర్భంగా ఆస్పత్రిలో ఉన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

పొంచి ఉన్న ప్రమాదాలు..



గుండుమల రోడ్డు పక్కనే ఉన్న బావి

మడకశిరరూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న బావులు, రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మడకశిరలోని అదిరెడ్డి పాళ్యం మెయిన్ రోడ్డు నుంచి అక్కంపల్లి, సిద్దగిరి, గుండుమల మీదగా గుడిబండ, రొళ్ల మండలాలకు చెందిన దాదాపు 10 గ్రామాల ప్రజలు పని నిమిత్తం మడకశిర వచ్చి వెళ్లే రోడ్డులో మూడు చోట్ల రోడ్డు పక్కనే బావులు ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే ఆవకాశం లేకపోలేదు. దాసరి బండ వద్ద రోడ్డు మలుపు వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రమాదాలు జరుగకుండా రోడ్డు పక్కన బావుల వద్ద రక్షణ గోడను నిర్మించడంతోపాటు రోడ్డు మలుపును వెడల్పు చేసి వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా చూడాల్సిన ఆవసరం ఎంతైనా ఉంది.

గుంతల దారి.. పడతారు జారి..





రోడ్డంతా గుంతలు పడి ఉన్న ఎల్లోటి రోడ్డు

మడకశిరరూరల్: మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. హిందూపురం జాతీయ రహదారిలోని మడకశిర మండలం తడకలపల్లి క్రాస్ నుంచి ఎల్లోటి గ్రామం వరకు దాదాపు నాలుగు కిలో మీటర్లు వరకు రహదారి ఉంది. ఇందులో రెండున్నర కిలో మీటర్లు వరకు అడుగు అడుగునా కంకర తేలి గుంతలు పడి అధ్వానంగా ఉంది. దీంతో అటూ వాహనదారులు ఇటూ ప్రజలు నడిచి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో అత్యవసర పని, వైద్యం కోసం వెళ్లాలంటే మరింతగా ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని ప్రజలు చెబుతున్నారు. కంకర తేలి గుంతలు పడిన రోడ్లు రూపు రేఖలు మార్చుతామని గత సంక్రాంతి పండుగకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ఆర్భాటంగా ప్రకటించారని, ఇప్పటికీ మా గ్రామ రోడ్డు దుస్థితి మారడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

‘వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవరూ టీడీపీలోకి చేరలేదు’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: పత్తికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలెవరూ టీడీపీలోకి చేరలేదని ఆ పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డయ్య, బాలక్రిష్ణారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, నరసింహమూర్తితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. టీడీపీకి ఇవే చివరి ఎన్నికలని, ఆతర్వాత టీడీపీ ఉండదని, అలాంటి పార్టీలోకి తమ కార్యకర్తలు ఎందుకు చేరుతారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ నాయకత్వంలో తమ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా పని చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని టీడీపీ నాయకులు మానుకోవాలని హితవుపలికారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ఎంపీపీ గీత దంపతులు

పెనుకొండ రూరల్: కోనాపురం ఎస్సీ కాలనీలో సప్పలమ్మ ఆలయ నిర్మాణానికి ఎంపీపీ గీత దంపతులు శనివారం రూ.25 వేలను విరాళంగా అందజేశారు. కాలనీవాసులు కొల్లప్ప, మంక్కాలప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

హిందూపురం టౌన్: పట్టణంలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు గోవర్ధన్ రెడ్డి 70 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి శుక్లాల సమస్య ఉన్న వారిని 25 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారికి కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, రోటరీ సభ్యులు ఓబులకొండయ్య, నాగన్న తెలిపారు.

హామీల అమల్లో ‘కూటమి’ విఫలం



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

• మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: ఎన్నికల హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజక వర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ విమర్శించారు. శనివారం కళ్లగేరి గ్రామంలో ఆమె కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీల అమలు తీరుతెన్నులపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా దగా చేసిందని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, రెడ్‌బుక్ పేరుతో అరచాకాలు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. ప్రధానంగా తమ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

డిజిటల్ బుక్‌లో నమోదు..

కూటమి నాయకులు, అధికారులు పెట్టే ఇబ్బందులు, చేసే అరాచకాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అనంతరం ప్రజల సమక్షంలో పార్టీ శ్రేణులతో కలసి డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటేశు, టౌన్ కన్వీనర్ మేదర శంకర , గోరంట్ల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గంపల వెంకటరమణారెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, ముఖ్య నాయకులు శ్రీనివాసరెడ్డి, అంజినరెడ్డి, బాబావలి, గోపాల ఆచారి, సోము, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘కూటమి’ అరాచకాలపై డిజిటల్ బుక్ బ్రహ్మాస్త్రం



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నేతలు

అమరాపురం: రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి నేతలు చేస్తున్న దాడులు, అక్రమ కేసులకు డిజిటల్ బుక్ బ్రహ్మాస్త్రంలా పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ. విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ రెడ్‌బుక్ రాజ్యంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్ట్‌లకు చేయిస్తున్నారని విమర్శించారు. కూటమి నేతల బెదిరింపులు, అక్రమ కేసులపై డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూటమి నేతలు, అధికారులు చేసిన అరాచకాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు శివకుమార్, శివన్న, పంచాయతీ కన్వీనర్లు శివారెడ్డి, జోగింద్ర, రవికుమార్, రవి, నాగేంద్రప్ప, ఎంపీటీసీలు కెంచప్ప, నారాయణ, మైలారప్ప, సర్పంచులు, ఆలదపల్లి పంచాయతీ వ్యవసాయ వైఎస్సార్‌సీపీ విభాగం అధ్యక్షుడు కురి రాజప్ప, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు నాగన్న, జీకె.మూర్తి, యంజేరప్ప, నబీరసూల్, ఇషాక్, నాగరాజు, నారయణప్ప, తిప్పయ్య, నరసింహప్ప, మంజునాథ, బీడీ.మూర్తి, నిద్రగట్ట నటరాజు, తిప్పేస్వామి, చిత్తప్పయాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ: అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీసర్కిల్లో శనివారం సీపీఎం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మట్లాడుతూ 2025 ఏప్రిల్ నెలలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశం సహా ప్రపంచ దేశాలన్నింటిపైనా తీవ్ర ప్రభావం చూపిందన్నారు. దేశ వ్యవసాయ రంగం ధ్వంసమవుతోందని, సేవా రంగాన్ని గందరగోళంలో పడేస్తోందన్నారు. మన రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, పట్టు, డైరీ, ఉద్యాన రంగం వంటి అనేక రంగాలు దెబ్బతిన్నాయన్నారు. ఉద్యోగులు, కార్మికులు, రైతులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. మన దేశ స్వతంత్ర విధానాలకు మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలని రామకృష్ణ కోరారు. నాయకులు హరి, బాబావలి, నాగరాజు, నరసింహ, రాజారావు, నాగార్జున పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: జైలు నుంచి బయటకెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ ఖైదీలకు సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. సబ్‌జైలులోని రిమాండ్ ఖైదీలను ఎప్పటి నుంచి కారాగారంలో ఉంటున్నారు ఏ తప్పులు చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం న్యాయవాదులు ఏర్పాటు చేసుకున్నారా, వైద్య సేవలను అందుతున్నాయా, జైలు సిబ్బంది ఇబ్బందులైనా కల్గిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు వస్తుంటారని ఇక నుంచైనా మార్పు రావాలన్నారు. ఎలాంటి సమస్యలైనా నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఉద్దేశంతోనే ఫిర్యాదులు పెట్టెను ఏర్పాటు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. పోలీసులు ఛార్జ్ షీట్ దాఖలు చేసి ఉంటే ఖచ్చితంగా బెయిల్ వస్తుందని తెలిపారు. వైద్యులు పరీక్షల నిమిత్తం రావడం లేదని తెలుసుకున్న న్యాయమూర్తి వెంటనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జైలర్ హనుమప్ప, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుడిబండ: ఫళారం గ్రామంలో శనివారం సాయంత్రం పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి 144 ఒరిజినల్ చాయిస్ టెట్రా 90 ఎంఎల్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. దాడిలో ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

రొద్దం: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపాన ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం పెన్నానదిలో అర్చకులు గిరీష్‌స్వామి సమక్షంలో గంగపూజ, కలశ పూజ నిర్వహించారు. పెన్నానదిలో గంగను కలశాలతో తీసుకొచ్చి విగ్రహం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేసి వాల్మీకి విగ్రహానికి అభిషేకం చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని, 6న వాల్మీకి విగ్రహ ప్రతిష్ట ఉంటుందని వాల్మీకి అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన అమ్మాజి జాతర

రొళ్ల: జీరిగేపల్లిలో వెలసిన అమ్మాజి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జాతర శనివారం ముగిసింది. త్రిశక్తి దేవతలుగా విరజిల్లుతున్న గ్యారక్క, మారక్క, ముడుపక్క అమ్మవార్లకు వారం రోజుల పాటు దేవీ శరన్నవరాత్రి దసర ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. జాతరకు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ముగింపు సందర్భంగా అమ్మవార్లను వివిధ రకాల పూలు, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

హిందూపురం: స్థానిక తపాలా కార్యాలయంలో సోమవారం నుంచి ఈనెల 10 వరకూ ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ విజయకుమార్ తెలిపారు. అలాగే అక్టోబర్ 8 నుంచి కదిరి సబ్ పోస్టాఫీసు, బూదిలి సబ్ పోస్టాఫీసు, ధర్మవరం హెడ్ పోస్టాఫీసు, ధర్మవరం ఆర్‌ఎస్ పోస్టాఫీసు ప్రశాంతి నిలయం సబ్ పోస్టాఫీసుతోపాటు నిర్దేశించిన పాఠశాలలు, నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలతో సహా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్యాంపులు జరుతాయన్నారు. ఐదు నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తామని తెలిపారు.

తాళికెరెలో విషాదఛాయలు

• రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతురాలు నేత్రావతి(ఫైల్)

పావగడ: పట్టణంలోని శిరా రోడ్డులో ఓ పెట్రోల్ బంకు ఎదుట చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మడకశిర తాలూకా తాళికెరె గ్రామానికి చెందిన మహిళ నేత్రావతి(38) దుర్మరణం చెందడంతో మృతురాలి స్వగ్రామంలో శనివారం విషాద ఛాయలు అలము కున్నాయి. పోలీసులు అందించిన వివరాలు.. తమ కుమారుడి కి ఆరోగ్యం బాగా లేక పోవడం తో బైక్‌పై నేత్రావతి భర్త తిప్పేస్వామితో కలిసి పావగడకు వచ్చింది. అనంతరం తిరుగు ప్రయాణంలో స్థానిక శిరా రోడ్డులో బైక్‌కు పెట్రోల్ వేయించుకోడానికి తిప్పేస్వామి భార్య, కుమారుడిని రోడ్డుపై ఉంచి పెట్రోల్‌బంకులోకి వెళ్లాడు. ఆ సమయంలో శిరా వైపు నుంచి వేగంగా వస్తున్న ఓ లారీ వెనుక వైపు ఢీ కొని ఆమె మీద వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఘటనపై మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన లారీ ని స్వాదీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ సురేశ్ శనివారం తెలిపాడు. మృతురాలికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బోధనలో విషయ పరిజ్ఞానం ముఖ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రెడ్డెప్ప

హిందూపురం టౌన్: బోధనలో విషయ పరిజ్ఞానం ముఖ్యమని డిప్యూటీ డీఈఓ రెడ్డెప్ప ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో పెనుకొండ డివిజన్‌లోని డీఎస్సీ–25 ఉపాధ్యాయలకు ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులతో మమేకమవుతూ బోధన చేయాలన్నారు. వస్త్రధారణ, నడవడిక విషయంలో సంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కార్య నిర్వహణ జిల్లా అధికారి మాలిక్, ఎంఈఓలు శేషాచలం, గంగప్ప, ప్రసన్న లక్ష్మి, డైట్ పరిశీలకులు ప్రభాకర్, ఆదర్శ్, భారత్ విద్యా సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస రెడ్డి, ఎస్ఆర్‌పీ బాబా, ఈశ్వర‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పపెట్టిన వారిని అరెస్ట్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చిలమత్తూరు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిందితుల్ని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వెంటనే నిందితులని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామూర్తి, ఎస్సీ సెల్ నాయకులు శ్రీరాములు, మలుగూరు శివన్న, నరసింహులు,అంబేద్కర్ నవీన్, చందు, శంకర, రవి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గాయపడిన జింక కారుణ్య సొసైటీకి అప్పగింత

గోరంట్ల: గోరంట్ల సమీపంలో శనివారం జింక గాయపడింది. దీన్ని గమనించిన న్యూస్ పేపర్ ఏజెంట్ చంద్ర జింకను చేరదీశారు. విషయం తెలుసుకున్న ఆటవీ శాఖ సిబ్బంది రామకృష్ణ గాయపడిన జింక స్వాధీనం చేసుకొని పుట్టపర్తిలో జంతు సంరక్షణ శాల అయిన కారుణ్య సొసైటీకి అప్పగించి వైద్యసేవలు అందించారు.

వృద్ధుడు అదృశ్యం

గోరంట్ల: పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కంచు కుంజీకుట్టపన్ (88) ఈనెల 2న సెలూన్ షాపునకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. శనివారం బాధితుడి అల్లుడు విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

కొత్త ధరలకే విక్రయించాలి

రొళ్ల: వ్యాపారులు కొత్త జీఎస్టీ ధరలకే వస్తువులను విక్రయించాలని తహసీల్దార్ షేక్షావలి సూచించారు. శనివారం అయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. వివిధ అంగళ్ల యజమానులు పాత ధరలకే నిత్యవసర సరుకులను విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నూతనంగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ ధరల ప్రకారం విక్రయించాలని తెలియజేశారు.

పోలీసుల పల్లెనిద్ర

లేపాక్షి: సోమిరెడ్డిపల్లిలో హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎస్‌ఐ చెన్నయ్య, సిబ్బంది పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శాంతిభద్రతల పరిరక్షణ, ఆస్తి తగాదాలు, బాల్యవివాహాల నిర్మూలన, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

సామాజిక సర్వే వేగవంతం

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక రాష్ట్ర వెనుక బడిన వర్గాల మండలి నేతృత్వంలో చేపడుతున్న సామాజిక సర్వే పావగడంలో వేగవంతంగా సాగుతోంది. పట్టణంలోని 7 వ వార్డు రెయిన్ గేజ్ ప్రాంతంలో సర్వే అధికారి శ్రీనాథ్ శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. గృహ విద్యుత్ మీటర్ల నంబర్ల ఆధారంగా ఆ ఇంటికి చెందిన సభ్యుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డులను పరిశీలించి వారి సామాజిక, విద్య రంగాల స్థితిగతులను పరిశీలించారు.

ప్రణాళిక తయారీపై గ్రామసభలు

అమరాపురం: ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రణాళిక తయారీపై హేమావతి, నిద్రగట్ట పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి కూలీలు, రైతుల సమక్షంలో గ్రామాల్లో ఏఏ పనులు కావాలి, ఏఏ పనులు చేస్తారు, నిధులు ఎంత ఖర్చు అవుతుంది, తదితర వివరాలపై చర్చించి నివేదికను తయారు చేశారు. ఈ నివేదికను ఎంపీడీఓ కార్యాలయానికి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి అమోదం కోసం పంపనున్నట్లు ఏపీఓ శివన్న తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రొళ్ల: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆవినకుంట గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో కేసులు, మహిళలపై వేధింపులు, వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ హిదాయితుల్లా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.